# ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలి



బెటాలియన్‌లోని పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జడ్జి రాధిక జైస్వాల్

రాజన్న సిరిసిల్ల, మే12 (నమస్తే తెలంగాణ) : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. రాజీమార్గమే రాజమార్గమన్నది గుర్తించాలని సూచించారు. సర్ధాపూర్‌లోని 17వ బెటాలియన్‌లో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు సిబ్బందికి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నచిన్న గొడవలతో కేసులు పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృథా అవుతాయన్నారు. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని పంతాలు, పట్టింపులకు పోయి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీ శ్రీనివాస్, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, అడిషనల్ కమాండెంట్ సురేశ్, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయానికే 'గ్రీవెన్స్ డే'


బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్ బీ గితే

తెలంగాణ చౌక్, మే 12: ప్రజల నుంచి స్వీకరించే ప్రతి ఫిర్యాదుపై బాధితులకు సత్వర న్యాయం అందించేందుకే గ్రీవెన్స్ డే కార్యక్రమం ఏర్పాటు చేశామని ఎస్పీ మహేశ్ బీ గితే అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు బాధితుల నుంచి ఎస్పీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 26 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్టప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిషారమయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు సమర్థవంతంగా సేవలందించాలన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని తెలిపారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శంకర్

వేములవాడ రూరల్, మే 12 : రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందగా కూతురు తలకొరివి పెట్టిన సంఘటన వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, నాగయ్యపల్లికి చెందిన అచ్చ శంకర్ (50) కోనాయపల్లిలో ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఆదివారం రాత్రి కరీంనగర్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో శంకర్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఒక్కగాని ఒక్క కూతురు అమూల్య ఇటీవలే వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 500 పైగా మార్కులు రావడంతో కష్టపడి కూతుర్ని మంచిగా చదివిస్తానని కూతురితో అనేవాడన్నారు. కానీ రోడ్డు ప్రమాదంలో తండ్రి చనిపోవడంతో అమూల్య కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తండ్రికి తలకొరివి పెట్టింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మూడపల్లిలో అక్రమ నిర్మాణం

- పనులను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

చందుర్తి,మే12: మూడపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిని అనుకుని ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపట్టాడు. గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వెనుకల గల ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడం చేపట్టడంతో గ్రామస్తులు తహసీల్దార్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. నిర్మాణం జరిగే స్థలాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహేందర్ పరిశీలించి పనులు ఆపాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టడంతో వివాదం తెరపైకి వచ్చింది. గతంలో కూడా ఈ రైతు ప్రభుత్వ భూమిలో బోరు వేయగా మిషన్ భగీరథ పైపు పగిలి ప్రభుత్వానికి నష్టం వాటిల్లింది. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శి అనిల్‌ను వివరణ కోరగా గ్రామంలో చేపడుతున్న నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని అక్రమ కట్టడాలు తొలగిస్తామని తెలిపారు.

## రాజన్న గోశాలను పరిశీలించిన కలెక్టర్

వేములవాడ టౌన్, మే 5 : వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయ గోశాలను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా గోశాలలోని కోడెలకు జియో ట్యాగింగ్ చేయాలని, వాటి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు చూసి తగిన వైద్యం చేయించాలని అధికారులను ఆదేశించారు. మరికొద్ది రోజుల్లో గోవులను రైతులకు అందజేస్తామని, ఆలయ అధికారులు పక్కా ప్రణాళికతో రైతులకు మాత్రమే ఇవ్వాలన్నారు. ఈ విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఆలయ అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేశ్, ఏఈవో శ్రీనివాస్ తదితరులున్నారు.

# ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్ర సంఘం ఎన్నికలు

- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య


సమావేశంలో మాట్లాడుతున్న కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

వేములవాడ, మే 12: మున్నూరు కాపు రాష్ట్ర సంఘం ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు మున్నూరు కాపు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల నుంచి మండల, జిల్లాస్థాయి అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల వరకు పూర్తిగా సేకరించిన ఎన్నికల లిస్టును అపెక్స్ కమిటీ గౌరవ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, అధ్యక్షుడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు అప్పగిస్తామని తెలిపారు. ఆ తదుపరి ఎన్నికల అధికారులను నియమించి ప్రజాస్వామ్యబద్ధంగా ఈ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని ఇప్పటికే హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం చేశామన్నారు. రాష్ట్రం మొత్తం ఒకేసారి నియోజకవర్గాల వారీగా ఓటింగ్ నిర్వహించే విధంగా కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వేములవాడ నియోజకవర్గానికి ఎన్నికల నివేదిక అందించేందుకు కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఉపాధ్యక్షుడు కూరగాయల కొమరయ్య, సభ్యులుగా మారం కుమార్, కూరగాయల మల్లేశం, గోస్కుల రవి, మార్గం సత్తయ్య, గసికంటి వేణు, ఎర్రం నరసయ్యతో కూడిన కమిటీని నియమించామని తెలిపారు. సమావేశంలో ఉమ్మడి పట్టణ సంఘం అధ్యక్షుడు ఇప్పపూల అజయ్, మారం కుమార్, గోస్కుల రవి, కూరగాయల మల్లేశం, కొండ కనకయ్య, కొండ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ సేన అంటే జంకెందుకు..?

- ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతాం
- ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా వదలబోం
- కాంగ్రెస్ నేతల ఆరోపణలపై కేటీఆర్‌సేన మండలాధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ ఆగ్రహం


కేటీఆర్ సేన గ్రామ కమిటీకి నియామక పత్రాలు అందజేస్తున్న కేటీఆర్ సేన మండలాధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు

సిరిసిల్ల రూరల్, మే 12: కేటీఆర్ సేన అంటే కాంగ్రెస్‌కు జంకెందుకని కేటీఆర్ సేన తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు నందగిరి భాస్కర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాస్కర్‌గౌడ్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిరిసిల్లలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసి ఈ ప్రాంతాన్ని వేల కోట్లతో అభివృద్ధి చేశారని కొనియాడారు. ప్రపంచ దేశాలను ఆకర్శించి, రాష్ట్రానికి కోట్ల పెట్టుబడుల, ఐటీని అభివృద్ధి చేసిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. కేటీఆర్ యూత్ ఐకాన్ అని, ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారని పేర్కొన్నారు. కేటీఆర్ సేన ఏర్పాటు చేయడంతో కాంగ్రెస్ నేతలు ఎందుకు జంకుతున్నారని, భయమెందుకని ప్రశ్నించారు. కేకే యువసేన పేరిట కాంగ్రెస్ నేతలు ఏర్పాటు చేసుకున్న విషయం తెలియదా? అన్నారు. సోనియాగాంధీని బలి దేవత అన్నది మీ నాయకుడు కాదా? అని ప్రశ్నించారు. కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌పై విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేటీఆర్ సేనను గ్రామ గ్రామాన బలోపేతం చేస్తామని, కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేసేదాకా వదలబోమని, ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడతామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని పేర్కొన్నారు. మీకు చేతనైతే మా కేటీఆర్ చేసిన అభివృద్ధితో పోటీపడి అభివృద్ధి చేయాలని సూచించారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకొని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మామిడాల విజయ్, రేగుల రాజు, తౌటి శివ, మామిడాల ఉమాశంకర్, విన్నుబాబు, అజయ్, బాలసాని వెంకటేశ్, మహిపాల్, శ్రీకాంత్ తదితరులున్నారు.

### అంకుసాపూర్‌లో కేటీఆర్ సేన గ్రామ కమిటీ ఎన్నిక

తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌లో సోమవారం కేటీఆర్ సేన మండలాధ్యక్షుడు నందగిరి భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని నియమించారు. గ్రామ అధ్యక్షుడిగా బాలసాని వెంకటేశం గౌడ్, ఉపాధ్యక్షుడిగా బోనుగోని మహిపాల్ యాదవ్, కార్యదర్శి మిడిదొడ్డి శ్రీకాంత్, కోశాధికారి రేగుల సురేందర్‌ను నియమించారు. ఈసందర్భంగా నూతన కమిటీనీ బీఆర్‌ఎస్ నేతలు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడ్డగట్ల భాస్కర్, మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య, సావనపల్లి బాలయ్య, కురుమ రాజయ్య, తుమ్మల కనకయ్య, శ్రీనివాస్, కేటీఆర్ సేన నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోండి

- ప్రజావాణిలో కలెక్టర్‌కు కొలనూర్ గ్రామస్తుల ఫిర్యాదు


ఫిర్యాదు పత్రాన్ని చూపిస్తున్న కొలనూర్ గ్రామస్తులు

కోనరావుపేట, మే 12: మండలంలోని కొలనూర్ గ్రామంలో అక్రమార్కులు అక్రమ వెంచర్ ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలోని సర్వే నంబర్ 293/సిలో గల 0.38గుంటల భూమిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి పది శాతం వాటా 3.8గుంటల భూమి రావాల్సి ఉందని వారు పేర్కొన్నారు. ప్రజావాణిలో పలుసార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్ ఇప్పటివరకు పట్టించుకోలేదని వాపోయారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంతోపాటు గ్రామ పంచాయతీకి రావాల్సిన వాటాను ఇప్పించాలిని వారు కోరుతున్నారు.


మహిళా సంఘాలకు ఎరువుల దుకాణాల మంజూరి పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

# మహిళా సంఘాలు ఆర్థిక పురోగతి సాధించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

రాజన్న సిరిసిల్ల, మే12 (నమస్తే తెలంగాణ) : వ్యాపార రంగాల్లో రాణిస్తూ ఆర్థిక పురోగతి సాధించాలని మహిళా సంఘాలకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పిలుపునిచ్చారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళా సంఘాలకు ఎరువులు, పురుగుల మందుల దుకాణాలు కేటాయించారు. ఈసందర్భంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సంఘ మహిళలకు మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. వేములవాడ, ముస్తాబాద్, బోయినపల్లి, కోనరావుపేట గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట తంగళ్లపల్లి మండలాల్లో దుకాణాలు పెట్టుకునేందుకు మహిళా సంఘాలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పొందిన మహిళలు వివిధ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి అఫ్జలిబేగం, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్ తదితరులున్నారు.

### దరకాస్తులు గడువులోగా పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను ఆయన స్వయంగా స్వీకరించారు. దరఖాస్తుదారుల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శేషాద్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకులకు పరామర్శ


వేములవాడలో వార్డు అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్‌ను పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, మే 12: వేములవాడ పట్టణంలోని 21వ వార్డు పాత కూరగాయల మార్కెట్‌కు చెందిన బీఆర్‌ఎస్ వార్డు అధ్యక్షుడు గుండా రాజశేఖర్ గౌడ్ సతీమణి వరలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం పరామర్శించారు. మహాలక్ష్మి వీధిలో గొట్టం మయాంక్ కూడా ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. ఇక్కడ ఆయన వెంట పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్లు నరాల శేఖర్, మారం కుమార్, సీనియర్ నాయకులు నరాల దేవేందర్, నీరటి మల్లేశం తదితరులున్నారు.


గంభీరావుపేట: మండల కేంద్రంలోని వరద నీటిలో వడ్ల కుప్పలు

# అకాల వర్షం.. అపార నష్టం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరి ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు
- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి

గంభీరావుపేట/రుద్రంగి/కోనరావుపేట/ వీర్నపల్లి, మే 12: అకాల వర్షాలు అన్నదాతలకు అపార నష్టాన్ని కలిగిస్తున్నాయి. సోమవారం గంభీరావుపేట, రుద్రంగి, కోనరావుపేట, వీర్నపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో అకాల వర్షం పడింది. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన వరి ధాన్యంతోపాటు తూకం వేసిన వడ్ల సంచులు సైతం తడిసిపోయాయి. మ్యాచర్ వచ్చినప్పటికీ వడ్లు కొనుగోలు చేయడం లేదని, అలాగే అకాల వర్షంతో తాము నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.


రుద్రంగి: మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం

# భక్తుల మనోభావాలను గౌరవించాలి

- ఆలయం మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- రాజన్న ఆలయ పరిరక్షణ సమితి
- 14న వేములవాడ బంద్ విజయవంతం చేయాలని పిలుపు


కరపత్రాన్ని విడుదల చేస్తున్న అఖిల పక్షం, వేములవాడ రాజన్న ఆలయ పరిరక్షణ సమితి నాయకులు

వేములవాడ, మే 12: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి భక్తుల మనోభావాలను గౌరవించి, ఆలయం మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాజన్న ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు, అఖిలపక్షం నాయకులు డిమాండ్‌చేశారు. ఆలయం మూసివేత నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పట్టణానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు వేములవాడ రాజన్న ఆలయ పరిరక్షణ సమితిగా ఏర్పడి సోమవారం పట్టణంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేసే క్రమంలో విస్తరించేందుకు తాము సానుకూలంగా ఉన్నామని, అయితే అభివృద్ధి పనులు ఏండ్ల కొద్దీ గడిచే అవకాశం ఉన్నందున ప్రధాన ఆలయంలో శ్రీ స్వామివారి దర్శనం యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆలయాభివృద్ధికి సంబంధించిన డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు వెల్లడించకుండానే, అభివృద్ధి పనుల వివరాలు ప్రజలకు తెలియజేయకుండానే ఆలయాన్ని మూసివేయాలని నిర్ణయం తీసుకోవడం భక్తుల మనోభావాలను గాయపర్చడమేనన్నారు. ఆలయాన్ని అభివృద్ధికి ఎన్ని నిధులు అవసరం అవుతాయో, ఆ నిధులు ఎక్కడి నుంచి వస్తాయో, అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి ఎన్నేండ్లు పడుతుందో ఎలాంటి స్పష్టత లేకుండానే ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. నిధుల సేకరణలో జాప్యం జరిగితే సంవత్సరాల పాటు ఆలయం మూసి ఉంచుతారా అని ప్రశ్నించారు. ఆలయాన్ని మూసివేస్తే భక్తుల మనోభావాలు దెబ్బతినడంతోపాటు వందలాది చిరు వ్యాపారుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఈ విషయంపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 14న వేములవాడ పట్టణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. రాజన్న ఆలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా ప్రతాప రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రామతీర్థపు రాజును ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, మాజీ కౌన్సిలర్లు నిమశెట్టి విజయ్, నరాల శేఖర్, సిరిగిరి రామచందర్, జోగిని శంకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కటకం శ్రీనివాస్, నాయకులు రామతీర్థపు రాజు, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, కోల కిష్టస్వామి, నరాల దేవేందర్, గడప కిశోర్‌రావు, సందీప్, రఘు, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.




సుద్దాలలో ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతులు చేయిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి అభిలాష్

### మురుగును తొలగించి.. సమస్యను పరిష్కరించి

నమస్తే ఎఫెక్ట్

కోనరావుపేట, మే 12: మండలంలోని సుద్దాల గ్రామంలో మురుగు నీటి సమస్యపై 'నల్లా నీరు కలుషితం' అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో సోమవారం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ కల్పన, గ్రామ పంచాయతీ కార్యదర్శి అభిలాష్ అక్కడి చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో కాల్వలో పేరుకుపోయిన మురుగు,చెత్తా చెదారాన్ని తొలగించారు. నల్లాకు సంబంధించిన పైపులైన్‌ను గ్రామ పంచాయతీ సిబ్బందితో మరమ్మతులు చేయించి గ్రామస్తులకు సురక్షితమైన నల్లానీటిని అందించారు. నాలుగు నెలలుగా నెలకొన్న సమస్య నమస్తే కథనంతో పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు


బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేసి నమస్కరిస్తున్న చల్మెడ

చందుర్తి/వేములవాడ రూరల్, మే 12 : చందుర్తి మండల కేంద్రంతోపాటు లింగంపేట బుద్ధ విహార్‌లో గౌతమ బుద్ధుడి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అతిథిగా బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరయ్యారు. కొన్నేళ్లుగా బుద్ధవిహార్ నిర్వహణ బౌద్ధ సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తున్న వ్యవస్థాపకుడు దప్పుల అశోక్‌ను అభినందించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, మైనార్టీ సెల్ నాయకులు ఇస్మాయిల్, బౌద్ధ ఉపాసకులు గ్రామస్తులున్నారు. వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ ప్రజాప్రతినిధులు, యువకులు, బుద్ధ జయంతి నిర్వాహకులున్నారు.

### బాధిత కుటుంబానికి మనోహర్‌రెడ్డి పరామర్శ

వేములవాడ రూరల్, మే 12 : వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మమ్మ మృతి చెందగా కుటుంబాన్ని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలియజేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ పండుగ తిరుపతి, నల్ల సంజీవరెడ్డి, మోహన్, దశరథరెడ్డి, కుంటయ్య, బాలకిషన్, తదితరులున్నారు.

### రాజన్నను దర్శించుకున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్

వేములవాడ టౌన్, మే 12 : వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారిని సోమవారం శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో వారు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయంలో వారు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేయగా, ఈవో వినోద్‌రెడ్డి వారికి స్వామివారి శేషవస్త్రం కప్పి, ప్రసాదాన్ని అందజేశారు.

### వాహనాల తనిఖీ

ఇల్లంతకుంట, మే 12 : మండల కేంద్రంలో సోమవారం ఎస్‌ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారుల వద్ద ఆర్సీ, లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, హెల్మెట్‌తోపాటు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాన్ని నడిపిన వారికి ఫైన్ విధించామన్నారు. ఇక్కడ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**
I Thammanaveni Sadaiah S/o. Yellaiah, H.No. 1-12, Village, Kukkalagudur, Palakurthy Mandal, Peddapalli District. Have Changed My Name As Thammanaveni Sadankumar Yadav S/o. Yellaiah.

**పేరు మార్చబడినది**
నేను సంజీవ్ నూతుల S/o. నూతుల కిష్టరెడ్డి (పాత పేరు) వయస్సు:50 సం||రాలు, ఇ.నెం. 7-86/1, రీచపల్లి , సారంగపూర్ మండలం జగిత్యాల జిల్లా తెలంగాణ. నా పేరు మార్చబడినది . నూతుల సంజీవరెడ్డి S/o. నూతుల క్రిష్ణారెడ్డి ( కొత్త పేరు)

**PASSPORT LOST**
★ Namala Mohan S/o.Namala Mallaiah H.No. 5-35, RR Colony, Anupuram,Vemulawada Mandal, Rajanna Sircilla Dist. My Pass Port No. E5597998 Lost Travelling by Bike From Anupuram to Vemulawada any one find Please Call : 9440050092
NTK-00000

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189